సాక్షి సంగారెడ్డి

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



..ఇక్కడ ఏడు రోజులే

తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగను సిద్దిపేటలోని తొమ్మిది గ్రామాల్లో ఏడు రోజులే నిర్వహిస్తున్నారు. వివరాలు IIలో ▸



పైసా వసూల్

సంగారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలు నడిపిస్తున్న ఏజెంట్లు పండగపూట అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. వివరాలు IIలో ▸



యంత్రం జాడేదీ?

రాయితీ వ్యవసాయ పరికరాల కోసం రైతులు ఆర్నెల్లుగా ఎదురుచూస్తున్నారు. వివరాలు IVలో ▸

న్యూస్‌రీల్

ఘనంగా బతుకమ్మ వేడుకలు



కలెక్టరేట్‌లో బతుకమ్మను ఎత్తుకున్న ఉద్యోగులు

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగుతున్నాయి. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు జగదీశ్, అఖిలేశ్‌రెడ్డి, రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రగతి చక్ర పురస్కారాలు



ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

జహీరాబాద్ టౌన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం ప్రగతి చక్ర పురస్కారాలు అందజేశారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ.శివలింగం విజేతలకు అవార్డులను ప్రదానం చేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ కండక్టర్లుగా శివకుమార్, ఆశ్వాక్, డ్రైవర్లుగా మల్లేశ్, ఫయాజ్, ఆర్ పీ.రెడ్డి, మెకానిక్‌లు శ్రవణ్‌కుమార్, ఐఎస్ రెడ్డి పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శివలింగం డ్రైవర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణ ప్రజలకు మంచి నీటి సరఫరా లో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్యలతో 25% మాత్రమే పన్ను వసూలవడం పట్ల ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. నీటి బకాయిలను త్వరగా వసూలు చేయాలని అధికారులకు సూచించారు.

వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

జహీరాబాద్ టౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ...రెండు నెలల నుంచి కార్మికులకు వేతనాలు రాకపోవడంతో దసరా పండగ సమయంలో పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ దేవుజాకు వినతి పత్రం అందజేశారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

సంగారెడ్డి ఆర్టీసీ డీఎం ఉపేందర్

సంగారెడ్డి టౌన్: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ పేర్కొన్నారు. ఆర్టీసీ డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు పలు సమస్యలపై మాట్లాడారు. సదాశివపేట నుంచి కృష్ణంరాజు మాట్లాడుతూ సదాశివపేట నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలన్నారు. అదేవిధంగా వట్టిపల్లి నుంచి రాయిపల్లి వరకు సర్వీస్ పొడిగిస్తూ దేవునూరుకు ట్రిప్పుల సంఖ్యను పెంచాలని నర్సింహులు కోరారు. నర్సాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు బస్సులు నడపాలని సలక్‌పల్లి నుంచి సాయిగౌడ్ విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి నుంచి రేగోడు కు నడుపుతున్న బస్సులకు అదనంగా మరో బస్సును నడపాలని కోరారు.

దసరా సందడి

- దుకాణాల్లో పెరుగుతున్న రద్దీ
- రాయితీలు, బహుమతులతో ఆకర్షిస్తున్న దుకాణదారులు
- కిటకిటలాడుతున్న మార్కెట్లు

సంగారెడ్డి జోన్: బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తుండటంతో కొనుగోలుదారులతో మార్కెట్ అంతా సందడిగా కనిపిస్తోంది. ప్రతీ ఒక్కరు నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తుండటంతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంతోపాటు పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, సదాశివపేట తదితర పట్టణాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు.

వారికి నచ్చేలా మెచ్చేలా...

వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లలో నిర్వాహకులు వినియోగదారులను ఆకట్టుకునేందుకు రాయితీలతోపాటు స్పాట్, డ్రా గిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. డ్రా గిఫ్టులలో కార్లతోపాటు బైకులు అందుబాటులో ఉంచారు. ఒక్కో దుకాణదారుడు ఇతర దుకాణాలతో పోటీ పడుతూ తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నారు. మరికొంతమంది దుకాణదారులు సినీ సెలబ్రిటీలతో ప్రారంభోత్సవాలు చేయించి వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు.

రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు

జిల్లావ్యాప్తంగా 150కి పైగా వస్త్ర దుకాణాలున్నాయి. ఆయా దుకాణాల్లో సరసమైన ధరల్లో వస్త్రాలను అందుబాటులో ఉంచారు. ఈ ఏడాది సుమారు రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు వ్యాపారాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాత్రి 11గంటలు దాటినా కొనుగోళ్లు జరుగుతున్నాయి.



సంగారెడ్డిలోని ఓ వస్త్రదుకాణంలో రద్దీ

ఆన్ లైన్‌లోనూ కొనుగోళ్లు

మారుతున్న కాలానికి అనుగుణంగా వస్త్ర దుకాణాలతోపాటు ఆన్‌లైన్‌లోనూ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మీషో, మింత్రా తోపాటు తదితర వెబ్ సైట్ల ద్వారా కూడా దుకాణదారులు ప్రత్యేక ఆఫర్లు కల్పిస్తున్నారు.

తగ్గిన జీఎస్టీతో పెరిగిన అమ్మకాలు

ఇటీవల పలు వస్తువులపై ఉన్న జీఎస్టీని తగ్గించారు. గతంలో 28% ఉన్న జీఎస్టీ ప్రస్తుతం 18%కి తగ్గించడంతో వాటి అమ్మకాలు పెరిగాయి. ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు వాహనాలపై వాటి విలువలను బట్టి ధరలు తగ్గాయి.



ఓ దుకాణంలో బహుమతుల కోసం ఉంచిన వస్తువులు

తాము కల్పిస్తున్న ఆఫర్లతో ప్రధాన చౌరస్తాలో బ్యానర్లు వేసి, ఆటోలతో ప్రచారాలు చేస్తున్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

కొను ‘గోల్‌మాల్’..!



చేప పిల్లల టెండరు ప్రక్రియలో అవకతవకలు

- అర్హత లేనివారికి కాంట్రాక్టు ఇచ్చేందుకు రంగం సిద్ధం!
- నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల ప్రక్రియ
- అలాంటిదేమీ లేదంటున్న అధికారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: చేప పిల్లల కొనుగోలు ప్రక్రియలో గోల్‌మాల్ జరుగుతోందా? అర్హత లేని వారికి ఈ చేపపిల్లల సరఫరా క్రాంటాక్టును కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారా? ఈ టెండరు ప్రక్రియ నిర్వహణలో సంబంధిత అధికారులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారా? అంటే అవుననే ఆరోపణలు వినవస్తున్నాయి. గత ప్రభుత్వ హయాం మాదిరిగానే ఈసారి కూడా ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలు వదలాలని నిర్ణయించింది. ఇందుకోసం చేప పిల్లలను కొనుగోలు చేసేందుకు మత్స్యశాఖ టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడి ఒత్తిడి మేరకు అధికారులు ఇలా నిబంధనలను తుంగలో తొక్కి సరఫరా కాంట్రాక్టును కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

3.49 కోట్ల చేపపిల్లల కొనుగోలుకు నిర్ణయం!

జిల్లాలో మొత్తం 1,135 చెరువులు ఉన్నాయి. ఇందులో 1,053 చెరువుల్లో చిన్న చేప పిల్లలు (సైజు 35 ఎంఎం – 40 ఎంఎం) వదలాలని నిర్ణయించారు. అలాగే సింగూరు, నల్లవాగు, మిలిగేరి రిజర్వాయర్లతోపాటు, 82 పెద్ద చెరువుల్లో పెద్ద సైజు (80 –100 ఎంఎం) చేపపిల్లలను వదలాలని భావిస్తున్నారు. ఇందుకోసం 2.03 కోట్ల చిన్న సైజు, 1.45 కోట్ల పెద్ద సైజు చేపపిల్లలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో మత్స్యశాఖ టెండరు ప్రక్రియ చేపట్టింది. ఒకే ఒక్క కాంట్రాక్టరు బిడ్ దాఖలు చేసినట్లు తెలిసింది. చిన్న సైజు చేప పిల్లకు 68 పైసల చొప్పున, పెద్ద సైజుకు రూ.1.78ల చొప్పున సరఫరా చేసేందుకు బిడ్ వేశారు. ఇదే కాంట్రాక్టరుకు అధికారులు సరఫరా బాధ్యతలను అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

- చేప పిల్లలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు తప్పనిసరిగా వాటిని ఉత్పత్తి చేసే చెరువులు ఉండాలి. కానీ కేవలం చేపల పెంపకం చెరువులు మాత్రమే ఉన్న కాంట్రాక్టరుకు ఈ చేప పిల్లలు సరఫరా చేసే కాంట్రాక్టును అధికారులు కట్టబెడుతుండటం గమనార్హం.
- సంబంధిత కాంట్రాక్టరుకు చేపపిల్లలు ఉత్పత్తి చేసే చెరువు ఉందా? లేదా అనేది నిర్ధారించేందుకు మత్స్య, పశుసంవర్ధక, రెవెన్యూ శాఖల అధికారులు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కై కలూరుకు వెళ్లి పరిశీలించారు. అయితే ఈ పరిశీలన మొక్కుబడిగా సాగిందనే ఆరోపణలున్నాయి.
- ఏదైనా టెండరు ప్రక్రియలో సింగిల్ (ఒకే ఒక్క) బిడ్డర్ పాల్గొంటే ఆ టెండర్లను రద్దు చేయాలి. కానీ సింగిల్ టెండరు వేసిన కాంట్రాక్టరుకు ఈ సరఫరా కాంట్రాక్టును కట్టబెడుతుండటం వెనుక ఆంతర్యమేంటనేది అధికారులకే తెలియాలి.

గతేడాది కంటే ఎక్కువ ధర

2024–25 ఆర్థిక సంవత్సరంలో 80 –100 ఎంఎం సైజు ఒక్కో చేప పిల్లకు రూ.1.73 చొప్పున సరఫరా జరిగింది. అయితే ఈసారి ఏకంగా ఈ రేటు రూ.1.78లకు బిడ్డింగ్ వేశారు. ఇలా కోట్లలో చేప పిల్లలు కొనుగోలు చేస్తే ప్రభుత్వ ఖజానాకు ఎంత మొత్తంలో గండి పడుతుందో అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలను అమలు చేశాం

సదరు కాంట్రాక్టరుకు అన్ని అర్హతలు ఉన్నాయి. హ్యాచరీస్ లేకపోయినప్పటికీ గుడ్లను ఇతరుల వద్ద తీసుకొచ్చి విత్తన చేపపిల్లలను ఉత్పత్తి చేసి సరఫరా చేయడానికి వీలుంటుంది. మేము స్వయంగా వెళ్లి ఈ చేపల చెరువులను పరిశీలించాం. చేప పిల్లల ధర తగ్గించాలని సదరు కాంట్రాక్టరుతో నెగోషియేషన్ (బేరం ఆడుతాము) చేస్తున్నాం. రేటు తగ్గించాలని కోరుతున్నాం. ఈ టెండరు ప్రక్రియ నిబంధనల మేరకే నిర్వహిస్తున్నాం. – ఆర్.ఎల్.మధుసూధన్, అసిస్టెంట్ డైరెక్టర్, ఫిషరీస్.

అసంపూర్తిగా డబుల్ ఇళ్లు

- జిల్లాలో 602 పూర్తికాని ఇళ్లు
- చిన్నచిన్న సమస్యలతో 932 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు
- రూ.4 కోట్ల చెల్లింపుల్లో జాప్యం



హత్నూర శివారులో అసంపూర్తిగా దర్శనమిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లు

హత్నూర (సంగారెడ్డి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల కోసం నిర్మించతలపెట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూమ్ నిర్మిస్తుంటే లబ్ధిదారులు ఆశతో ఎదురు చూశారు. కానీ ఏళ్లు గడిచినా ఆ భవనాలకు సంబంధించిన పనులు పూర్తికాకపోవటంతో లబ్ధిదారులు నిరాశకు లోనయ్యారు. పునాది, గోడలు లేక, శ్లాబ్ వేసి వదిలేసినవి జిల్లాలో 602 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు దర్శనమిస్తున్నాయి. చిన్న చిన్న సమస్యలు, నల్లా ట్యాపులు లేకపోవడం, విద్యుత్ వైర్లు బిగించకపోవడం, కిటికీలు, తలుపులు బిగించకపోవడం వంటివాటితో మరో 932 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి.

కాంట్రాక్టర్లకు రూ.4కోట్ల వరకు బకాయిలు

డబుల్ బెడ్రూమ్ భవన నిర్మాణాల కాంట్రాక్టర్లకు సుమారు జిల్లాలో రూ.4 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా బాకీలను ఇవ్వకపోవడంతోనే పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్లు నిర్మాణాలను చేపట్టలేకపోయారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇల్లు లేని పేదలకు స్థలం ఉన్నచోట లబ్ధిదారులకు రూ.5లక్షలను మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల అసంపూర్తి భవనాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో కోట్లాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరుగా మారింది.

పరిశీలనలో ఉంది



జిల్లాలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సమస్య రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. జిల్లాలో సుమారు రూ.4 కోట్లు వరకు కాంట్రాక్టర్లకు చెల్లింపు విషయంలోనే పనులు ఆగిపోయాయి. 932 డబుల్ బెడ్రూమ్‌లకు మిగిలి ఉన్న పనులను పూర్తి చేసి పంపిణీ చేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. 15 రోజుల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.
– చలపతిరావు.పీడీ, గృహ నిర్మాణ శాఖ

ప్రత్యేక కార్యాచరణతో కేసుల ఛేదన

ఎస్పీ పరితోశ్ పంకజ్

నారాయణఖేడ్: ప్రత్యేక కార్యచరణతో కేసుల ఛేదిస్తూ ప్రతీ కేసులోనూ నాణ్యమైన విచారణ చేసి బాధితులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. ఖేడ్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ పరితోశ్ పంకజ్ తనిఖీ చేశారు. ఠాణా ఆవరణలో మొక్కనాటి నీళ్లుపోశారు. ఠాణా పరిసరాల శుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, ఠాణా రికార్డులను తనిఖీ చేసి విచారణలో ఉన్న కేసుల వివరాలను ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై విద్యాచరణ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...విచారణలో సందేహాలుంటే విచారణ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. నేరాలు జరిగిన ప్రాంతాలను స్టేషన్ పార్ట్–11 మ్యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను క్రైమ్ హాట్ స్పాట్‌గా గుర్తించి నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి వాహనాల వేగం అదుపునకు ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుకడ్రమ్ములు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. నేరాల అదుపు, కేసుల ఛేదనలో ఉపయోగపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్పీ చెప్పారు.



ఠాణా ఆవరణలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

రూ.16.28కోట్లతో పట్టణాభివృద్ధి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణాన్ని రూ.16.28కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.15కోట్ల నిధులతో ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు మురుగు కాల్వలు, సీసీ నిర్మాణంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. గతంలో ప్రతిపాదించిన మేర 70 అడుగుల మేర రహదారిని విస్తరించనున్నట్లు తెలిపారు. ఉపయోగం లేని డివైడర్లను తొలగించి రోడ్డు విస్తరిస్తూ రహదారులను సుందరీకరణ చేయనున్నట్లు చెప్పారు. బసవేశ్వర చౌక్ నుంచి శివాజీచౌక్ మీదుగా రోడ్డు డివైడర్ల నిర్మాణంతోపాటు బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటి ట్యాక్సుల కలెక్షన్లతో పాటు, ఇతరత్రా అంశాల్లో ఉత్తమ మున్సిపాలిటీగా గుర్తించడంతో మంజూరైన రూ.1.28కోట్లతో పట్టణంలో ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తామన్నారు. బైపాస్ రోడ్డు పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

దసరా ఉత్సవాలు...

మున్సిపాలిటీ ద్వారా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, రావణ దహనం ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి చెప్పారు. పట్టణంలోని బతుకమ్మ సంబురాలకు బతుకమ్మ ఘాట్‌వద్ద ఏర్పాట్లు చేస్తున్నామని, విద్యుత్ స్తంభాలు సైతం బిగిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరీరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, యాదవరెడ్డి, సంగన్న పాల్గొన్నారు.


సంగారెడ్డి ఆర్డీఓగా రాజేందర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి ఆర్డీఓగా జి.రాజేందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజేందర్ నిజామాబాద్ జిల్లా మెప్మా పీడీగా పని చేస్తున్నారు. ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన రవీందర్‌రెడ్డిని ఇటీవల ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసి ఆందోల్ ఆర్డీఓ పొందుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. తాజాగా రెగ్యులర్ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజేందర్ ఒకటి, రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి.

‘స్థానిక’ రిజర్వేషన్లపై వదంతులు

- వట్‌పల్లి మండల స్థానిక రిజర్వేషన్ల జాబితా సామాజిక మాధ్యమాల్లో వైరల్
- ఆశావహుల్లో గందరగోళం.. వదంతులేనన్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండలంలో సర్పంచ్ రిజర్వేషన్లకు సంబంధించిన జాబితా తీవ్ర చర్చనీయాంశమైంది. మొత్తంగా 21 గ్రామ పంచాయితీల వారీగా సర్పంచ్ రిజర్వేషన్లకు సంబంధించిన ఓ జాబితా సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొట్టింది. దీంతో స్థానిక రిజర్వేషన్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారు ఒక్కసారిగా గందరగోళానికి గురయ్యారు. గ్రామ పంచాయితీల వారీగా రిజర్వేషన్ల జాబితా సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న విషయమై తెలుసుకున్న అధికారులు కూడా ముందు అయోమయానికి గురయ్యారు. తర్వాత ఆ జాబితా ఒట్టిదేనని స్థానిక రిజర్వేషన్లను అధికారికంగా ఇంకా బయటకు రాలేదని అధికారులు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఎంపీడీఓ అంజయ్య ‘సాక్షి’తో మాట్లాడుతూ...రిజర్వేషన్ల కేటాయింపుపై అసత్యాలు ప్రచారం చేయవద్దని, అలా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ANCHAYAT ELECTIONS 2025 MPP WATPALLY
ATION OF SARPANCH OF GRAM PANCHAYATS

andal	Name of the Gram Panchayat	Gram Panchayat Reserved for
	Bhoothkur	SC
	Bijlipur	BC
	Darakhasthupally	UR
	Devnoor	BC
	Dudiyal	UR
	Gomekal	BC

సామాజిక మాధ్యమంలో వైరల్ అయిన వట్‌పల్లి మండల సర్పంచ్ రిజర్వేషన్ల జాబితా

సింగూరు డ్యామ్ పటిష్టతకు చర్యలు

మట్టి పరీక్షలకు సూచన

- డీఆర్ఐపీ పథకంలో మరమ్మతులు
- డ్యామ్‌ను సందర్శించిన జీఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే


పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు పటిష్టతకోసం చర్యలు తీసుకుంటున్నామని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ బీపీ పాండే పేర్కొన్నారు. గోదావరి నది పరీవాహకంలో భాగమైన సింగూరు ప్రాజెక్టును బోర్డు సభ్యులు, నీటిపారుదల రంగం నిపుణులతో కలిసి బుధవారం సందర్శించారు. ప్రాజెక్టుకు డ్యామ్ సేఫ్టీ అధికారులు సూచించిన మేరకు పటిష్టతకోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సింగూరు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 29.9 టీఎంసీలైన డీఆర్‌పీ అధికారుల సూచన మేరకు 17 టీఎంసీలకు కుదించి మిగతా నీటిని దిగువకు వదులుతున్నామని తెలిపారు. డ్యామ్ మరమ్మతుల కోసం డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(డీఆర్ ఐపీ.డ్రిప్)క్రింద ఎంపిక చేశామని తెలిపారు. ఈ పథకం ద్వారా డ్యామ్ మరమ్మతులు చేయాలని నిర్ణయించామన్నారు. డ్యామ్ మట్టికట్టకు పడిన బుంగను పరిశీలించారు. నీటి నిల్వ సామర్థ్యం తగ్గించినందున డ్యామ్‌కు ప్రమాదమేమి లేదని తెలిపారు. ప్రాజెక్టు మట్టికట్టకు మట్టిపరీక్షలు చేయాలని అధికారులకు సూచించారు. మట్టి పరీక్షలు చేయడం వల్ల మట్టి నాణ్యతను పరీక్షించి మరమ్మతులు చేయడానికి సులభమవుతుందని తెలిపారు. ప్రాజెక్టు వద్ద శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. జీఆర్ఎంబీ చైర్మన్ వెంట బోర్డు సభ్యులు ఆర్ఎం రంగరాజన్, షర్మిల, ఎస్ఈ పోచమల్లు, ఈఈ బీం, డీఈ నాగరాజు, ఏఈలు మహిపాల్‌రెడ్డి, స్టాలిన్ పాల్గొన్నారు.



డ్యామ్‌ను సందర్శించిన జీఆర్ఎంబీ చైర్మన్ పాండే

సింగూరుకు భారీ వరద

సింగూరు ప్రాజెక్టుకు ఎగువనుంచి భారీ వరదలు రావడంతో దిగువకు 70 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వరదంతా డ్యామ్‌లోకి చేరుకుంటోంది. ప్రాజెక్టులో 17 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగతా నీటిని దిగువకు ఏడు గేట్ల ద్వారా కిందికి వదులుతున్నారు.



క్లుప్తంగా

అమ్మో.. చిరుత పులి

● లేగ దూడపై దాడి

కల్హేర్(నారాయణఖేడ్): చిరుత పులి సంచారంతో కల్హేర్, సిర్గాపూర్ మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి సిర్గాపూర్ మండలం కడ్పల్ గ్రామానికి చెందిన రైతు జంగం శామప్పకు చెందిన లేగ దూడను చిరుత పులి దాడి చేసి చంపింది. బుధవారం ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కడ్పల్ శివారులో అటవీలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయడంతో అప్పట్లో చిరుత పులి తిరుగుతున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయని తెలిపారు. కడ్పల్, ఖాజపూర్, ఖానాపూర్(కె), నాగధర్, రాపర్తి, కృష్ణాపూర్, సంజీవన్ రావుపేట చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో చిరుత సంచరిస్తుందని, అప్రమత్తంగా ఉండాలని కంగ్టీ సీఐ వెంకట్‌రెడ్డి సూచించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌కు గజ్వేల్ క్రీడాకారులు



క్రీడాకారులు అజయ్, అక్షిత్

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు గజ్వేల్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుండి 28 వరకు మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ క్రీడలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా జట్టుకు గజ్వేల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు పంజాల అజయ్, సందబోయిన అక్షిత్ ఎంపికయ్యారు. బుధవారం వీరిద్దరూ మహబూబ్‌నగర్‌కు వెళ్లారు.

అందరూ నియమాలు పాటించాలి

ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సద్భావన సంయోజక్ రామకృష్ణ



నర్సాపూర్: మన సంస్కృతిలో హక్కులు లేవని, కర్తవ్యం ఉందని, ఆయా నియమాలను అందరూ పాటించాలని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సద్భావన సంయోజక్ రామకృష్ణ చెప్పారు. రాబోయే విజయదశమి నాటికి ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బుధవారం స్థానిక సాయి కృష్ణ ఫంక్షన్‌హాలులో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ నర్సాపూర్ పట్టణ శాఖ స్వయం సేవకుల సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఎవరికి వారు పలు నియమాలు, నిబంధనలు పాటించాలన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగించాలని, మాతృ భాషలో మాట్లాడాలని చెప్పారు. కులవృత్తులు చేసే వారి పట్ల వివక్ష చూపవద్దని అందరం సమానమనే భావనతో మెలగాలని హితవు పలికారు. ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు ఉంటాయని, మన భూమి, పర్యావరణం పాడయ్యే ప్రమాదం ఉన్నందున ప్లాస్టిక్ వాడవద్దని రామకృష్ణ సూచించారు. సమావేశంలో డాన్‌బాస్కో స్కూల్స్ డైరెక్టర్ నర్సిరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవహ ఓంకార్, జిల్లా సహ సేవా ప్రముఖ్ నాగరాజు, నర్సాపూర్ పట్టణ కార్యవహ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో విద్యుత్ లైన్‌కు మరమ్మతులు



విద్యుత్ పోల్‌పై మరమ్మతులు చేస్తున్న జేఎల్‌ఎం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఊర చెరువులోని విద్యుత్ పోల్‌పై ఆదివారం వైరు తెగిపోవడం వల్ల వ్యవసాయ బావులకు సరఫరా నిలిచిపోయింది. దీంతో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని జేఎల్‌ఎం భార్గవ్, సిబ్బంది రమేశ్, చందుతో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో తెప్పపై విద్యుత్ పోల్ వరకు జేఎల్‌ఎం భార్గవ్ చేరుకుని మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాడు. ఆయనను పలువురు గ్రామస్తులు అభినందించారు.



కొండపాకలో 7వ రోజు సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంతటా 9 రోజులు.. ఇక్కడ ఏడు రోజులే

అదే రోజు సద్దుల బతుకమ్మ ఉత్సవాలు | సిద్దిపేట జిల్లాలోని 9 గ్రామాల్లో కొనసాగుతున్న సంప్రదాయం | కొన్నేళ్లుగా వస్తున్న ఆనవాయితీ

నంగునూరు(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహిస్తుండగా.. ఈ గ్రామాల్లో మాత్రం ఏడు రోజులే చేపట్టడం విశేషం. ఏడో రోజే సద్దుల సంబరాలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని తొమ్మిది గ్రామాల్లో కొన్నేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ గ్రామాల్లో ఈ నెల 27న సద్దుల బతుకమ్మను నిర్వహించుకోనున్నారు. పెత్తారమస రోజున ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిద రోజు సద్దుల బతుకమ్మతో పూల పండుగ ముగుస్తుంది. ఒక్కో రోజు ఒక్కో పేరుతో బతుకమ్మను రంగు రంగుల పూలతో అందంగా పేరుస్తారు. ఇలా రాష్ట్రం అంతటా నిర్వహిస్తారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంతోపాటు, మాచాపూర్, మెట్‌పల్లి, సలెంద్రి, కమ్మర్లపల్లి, అల్లీపూర్, నంగునూరు మండలంలోని రాజగోపాల్‌పేట, కొండపాక మండల కేంద్రంతో పాటు దమ్మక్కపల్లిలో ఏడు రోజులే బతుకమ్మ ఆడతారు.

ఆ గ్రామాల్లో దొంగలు పడ్డారని..

గతంలో అన్ని గ్రామాల మాదిరిగా ఇక్కడ సైతం తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండగను జరుపుకొనేవారు. అయితే సద్దుల బతుకమ్మ పండుగ రోజున ఊరంతా బతుకమ్మ ఆడేందుకు ఇళ్లకు తాళాలు వేసి చెరువు కట్టల వద్దకు వెళ్లారు. దీంతో ఇళ్లల్లో దొంగలు పడి బంగారం, వెండి, డబ్బులు, వివిధ వస్తువులను దోచుకెళ్లారు. దీంతో వారంతా ఏడు రోజునే సద్దుల బతుకమ్మను నిర్వహిస్తున్నారని గ్రామస్తుల కథనం.

మరో కథనం..

నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామాన్ని దేశ్‌ముఖ్‌లు పాలించిన కాలంలో రాజుకు ఏడుగురు కుమార్తెలు ఉండేవారు. పెళ్లయిన తర్వాత వారి అత్తగారింట్లో ఇబ్బంది కలగవద్దని, పుట్టినిల్లు, మెట్టినిల్లులో సద్దుల బతుకమ్మ పండగను ఆట పాటలతో జరుపుకోవాలన్న ఉద్దేశంతో ఏడు రోజే పండగను జరపడం ప్రారంభించారు. అప్పటి నుంచి అదే పద్ధతి కొనసాగుతోంది.

ఇక్కడ అన్నీ ఏడే ఉండటంతో..

కొండపాక గ్రామ శివారులో ఏడు చెరువులు, ఏడు కుంటలు, ఏడు హనుమాన్ల గుట్టలు, ఏడు వాగులు ఒకే చోట కలవడం, ఏడు బొడ్రాళ్లు ఒకే చోట ఉండటంతో ఏడో రోజే సద్దుల బతుకమ్మను జరుపుకొంటున్నారని పూర్వీకులు పేర్కొంటున్నారు. గతంలో కొండపాక గ్రామంలో పరిధిలోనే దమ్మక్కపల్లి ఉండేది ఇటీవల కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. దీంతో అక్కడ సైతం ఏడు రోజులకే నిర్వహిస్తున్నారు. దీంతో అప్పటి నుంచి 9వ రోజు కాకుండా 7వ రోజే సద్దుల బతుకమ్మ పండగను జరుపుకొంటున్నామని గ్రామస్తులు చెప్పుతున్నారు.

మా చిన్నతనం నుంచే..



గతంలో మా గ్రామాన్ని దేశ్‌ముఖ్‌లు పాలించేవారు. అప్పటి రాజులు పెట్టిన పద్ధతి ఇప్పటికీ కొనసాగుతోంది. మా చిన్నతనం నుంచే ఏడో రోజే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తున్నాం. మా కూతుళ్లు మా ఇంటి దగ్గర జరుపుకొన్న తర్వాతే వాళ్ల అత్తగారి ఇంటి వద్ద సద్దుల బతుకమ్మను చేసుకుంటారు.

– రంగు మల్లమ్మ, రాజగోపాల్ పేట

అదృష్టంగా భావిస్తున్నాం



అత్తగారింట్లో... తల్లిగారి ఇంట్లో సద్దుల బతుకమ్మ పండగను జరుపుకునే అదృష్టం మాకు కలిగింది. ఇలా మా ఊరి కూతుళ్లు.. కోడళ్లు రెండు చోట్ల పండగను నిర్వహించుకుంటారు. కొన్నేళ్లుగా ఏడో రోజే సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకొంటున్నాం.

– దొమ్మాట లక్ష్మి, కొండపాక

వాహనాల పార్కింగ్‌కు చెక్

జహీరాబాద్ : కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల పిరామల్ పరిశ్రమకు వచ్చే వాహనాలు ఎదుట ఉన్న జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డుపై పార్కింగ్ చేయకుండా అధికారులు చెక్ పెట్టారు. ఈనెల 22న సాక్షిలో 'సర్వీసు రోడ్డుపై పార్కింగ్?' శీర్షికన ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల అధికారులు స్పందించారు. మంగళవారం అధికారులు కర్మాగారాన్ని సందర్శించి, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. పరిశ్రమ అధికారులు, సెక్యూరిటీని పిలిపించి వాహనాలను సర్వీస్ రోడ్డు నుంచి తీయాలని ఆదేశించారు. ఇక మీదట సర్వీసు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటామని, ఇందుకు పరిశ్రమ నిర్వాహకులు మూడు రోజుల గడువు కోరినట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్



సర్వీసు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయొద్దంటూ సెక్యూరిటీని ఆదేశిస్తున్న అధికారి

టాస్క్‌ల పేరుతో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: టాస్క్‌ల కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ. 3 లక్షల 19 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. క్రైం సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఈనెల 1వ తేదీన ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. దీంతో ఆ మహిళ టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో బాధితుడు మహిళా చెప్పిన విధంగా నమ్మి ముందుగా రూ.5వేలు ఇన్వెస్ట్ చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతడికి వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ వస్తుందని చెప్పి నమ్మించడంతో వ్యాపారి పలు దఫాలుగా రూ. 3 లక్షల 19 వేలు వేశాడు. పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి టౌన్: ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల హక్కులను రక్షించేందుకు వివిధ రకాల చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం పొందేందుకు జిల్లా న్యాయస్థానాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరణించినా.. మరొకరికి ప్రాణ దానం

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు ఓ సంస్థకు దానం చేశారు. సిద్దిపేటకు చెందిన ప్రభుత్వ టీచర్ కిషన్‌గౌడ్ (59) పట్టణ శివారులో గత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికంగా పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడిని సోమవారం వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో అతడి అవయవాలను ఓ ఆర్గాన్ డొనేషన్ సంస్థకు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో జింక మృతి



నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం గురుసింగ్ తండా శివారులో అనుమానాస్పదస్థితిలో జింక మృతి చెందింది. ఖేడ్ అటవీశాఖ రెంజ్ అధికారిణి అనురాధ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తండా శివారులోని నీటి కుంట సమీపంలో ఓ జింక మృతిచెంది పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తమకు సమాచారం అందించారని తెలిపారు. బీట్ అధికారులు ధన్‌సింగ్, వరప్రసాద్ అక్కడకు చేరుకొని మృతిచెంది పడి ఉన్న జింకను పరిశీలించారని తెలిపారు. పాముకాటుతో మృతి చెందినట్లు భావిస్తున్నట్లు వివరించారు.

అదృశ్యమై.. చెరువులో శవమై..



చంద్రమ్మ

ములుగు(గజ్వేల్): వృద్ధురాలు చెరువులో శవమై తేలింది. ఈ ఘటన మండల కేంద్రం ములుగులో జరిగింది. ఎస్‌ఐ విజయ్ కుమార్ కథనం మేరకు... మండలానికి చెందిన కొల్లెల్లి చంద్రమ్మకు(70) కొద్ది రోజులుగా మతిస్థిమితం సరిగా లేదు. ఆమె ఈ నెల 21న ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం కుడుకుంట చెరువులో శవమై తేలింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

జహీరాబాద్ టౌన్: పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. మండలంలోని దిడ్గి గ్రామ పరిధిలో పేకాటాడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు.. బుధవారం దాడి చేశామన్నారు. గ్రామ పరిధిలో గల చెట్టు కింద ఆరుగురు పేకాడుతూ తమను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద రూ.17.600 నగదు, పేకాట ముక్కలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సుమోటో కేసు నమోదు చేశామని వివరించారు.

పైసా వసూల్!

● పండగ వేళ ప్రత్యేక బాదుడు
● కార్గో సేవల్లో నయా మోసం
● అదనపు డబ్బులు వసూల్ చేస్తున్న ఏజెంట్లు



సంగారెడ్డి బస్టాండ్‌లోని కార్గో కేంద్రం

సంగారెడ్డి క్రైమ్: ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలు నడుపుతున్న ఏజెంట్లు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా పండగ వేళ ఏజెంట్లు అదనపు చార్జీలు చెప్పి దండుకుంటున్నారు. అడ్డగోలుగా అడిగి వినియోగదారుల నడ్డి విరుస్తున్నారు. ఒకవేళ అడిగింది ఇవ్వకుంటే తమ పార్సల్ ఎక్కడ ఇవ్వారనే భయంతో అడిగింది ఇవ్వాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. తొలుత 2020 జూన్‌లో గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ సంస్థ సొంతంగా కార్గో సేవలు ప్రారంభించింది. మొదట ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్, ఇతర సిబ్బంది ద్వారా షిఫ్టుల విధానంలో కార్గో సేవలను చేసేవారు. అయితే తర్వాత ఆర్టీసీ ఆధీనంలో కొనసాగుతున్న కార్గో సేవా కేంద్రాలను టెండర్ల ద్వారా ప్రైవేట్‌కు అప్పగించారు. ఇందులో భాగంగానే జిల్లాల్లో 4 డిపోల పరిధిలో 6 కార్గో కేంద్రాలు ప్రైవేట్ వ్యక్తులతో నడిపిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ నిబంధనల ప్రకారం కిలోమీటర్లకు లేదా తూకానికి అనుగుణంగా ధర నిర్ణయించి తీసుకున్నప్పటికీ డెలివరీ సమయంలో అదనంగా డబ్బులు తీసుకుంటున్నారు.

అదనంగా డిమాండ్..

ఈనెల 2వ తేదీన పట్టణానికి చెందిన ఓ విద్యార్థి రూ. 100 చెల్లించి నర్సాపూర్ ఆర్టీసీ కార్గోలకు వస్తువులు పంపగా.. అదే రోజు అక్కడికి చేరింది. అయితే పార్సల్ తీసుకోనేందుకు వెళ్లిన వ్యక్తికి ఏజెంట్ రూ.10నుంచి రూ.20 అదనంగా డిమాండ్ చేశాడు. అదనంగా డబ్బులు ఎందుకు అని ప్రశ్నిస్తే డబ్బులు ఇవ్వాల్సిందేనని దబాయించాడు. అలాగే ఈ నెల 9వ తేదీన సంగారెడ్డి నుంచి జోగిపేట్‌కు ఎమర్జెన్సీ మెడిసిన్స్ సంబంధించిన ప్యాకింగ్‌ను రూ.95 చెల్లించి కార్గోలో పంపారు. అదే రోజు అక్కడికి చేరుకోవడంతో తెచ్చుకునేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి రూ.10 నుంచి రూ.20 వసూలు చేశారని వినియోగదారులు వాపోతున్నారు.

వందల సంఖ్యల్లో..

సంగారెడ్డి బస్టాండ్‌కే నిత్యం దాదాపు 150 నుంచి 200 పార్సిల్స్ వస్తుంటాయి. ఇతర కేంద్రాల్లోనూ బుకింగ్ డెలివరీ వందల సంఖ్యలోనే ఉంటున్నాయి. పటాన్‌చెరువు, జహీరాబాద్, జోగిపేట్, నారాయణఖేడ్, సదాశివపేట్ బస్టాండ్‌లో డెలివరీతో పాటు బుకింగ్ చేసే సమయంలో అదనంగా తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్గో కేంద్రాలు నిర్వహిస్తున్న దుకాణాలను టెండర్లలో దక్కించుకున్న సదరు వ్యాపారు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

మేనేజర్లు దృష్టి సారించడం లేదు

ఆర్‌టీసీ కార్గో సేవలు వినియోగంలో ఇష్టానుసారంగా అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. చేసేది ఏమీ లేక డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. దీనిపై మేనేజర్లు సైతం దృష్టి సారించడం లేదు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– ప్రశాంత్, సంగారెడ్డి

కుక్కను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి



సాయిప్రసాద్

కౌడిపల్లి(నర్సాపూర్): కుక్కను బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో 765డి జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. ఎస్‌ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం మూసాపేట్‌కు చెందిన పదంగల్ల సాయి ప్రసాద్(32) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సొంత పని ఉండటంతో తన బైక్‌పై మెదక్‌కు వెళుతున్నాడు. తునికి కేవీకే సమీపంలోనికి రాగానే కుక్క అడ్డురావడంతో అతని బైక్ అదుపుతప్పి కుక్కను ఢీకొన్నది. దీంతో సాయిప్రసాద్ కిందపడటంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైదరాబాద్ సూరారం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య పూజ, రెండు నెలల కూతురు ఉంది. మృతుడి తమ్ముడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి..

● కత్తితో పొడుచుకున్న భర్త
● డయల్ 100కు కాల్ చేసిన కుటుంబ సభ్యులు
● ఆస్పత్రికి తరలించిన మహిళా పోలీసులు



కత్తితో పొడుచుకున్న వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న మహిళా బ్లూకోల్ట్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: డయల్ 100కు స్పందించిన మహిళా బ్లూకోల్ట్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి కత్తితో పొడుచుకు వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... టూటౌన్ పీఎస్ పరిధిలో బ్లూకోల్ట్ సిబ్బంది పద్మ, మధులత బుధవారం విధులు నిర్వహిస్తున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన జింకసాగర్ సిద్దిపేటలోని తన అత్తగారింటికి వచ్చి భార్యతో గొడవపడి కత్తితో పొడుచుకోవడానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు డయల్ 100కు కాల్ చేశారు. స్పందించిన బ్లూకోల్ట్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి తీవ్ర గాయాలైన సాగర్‌ను ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. బ్లూకోల్ట్ సిబ్బందిని సీఐ ఉపేందర్, కాలనీవాసులు అభినందించారు.

క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతామని..

రూ.2.19 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరుటౌన్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించి.. ఓ వ్యక్తి వివరాలు చెప్పడంతో అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ. 2 లక్షల 19 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసిన చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఈనెల 19వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పడంతో బాధితులు తన క్రెడిట్ కార్డు వివరాలను చెప్పాడు. దీంతో అపరిచిత వ్యక్తి మీకు ఓటీపీ వస్తుంది, అది చెప్పాలని అడగడంతో నిజమే అనుకొని చెప్పాడు. దీంతో వెంటనే అతడి ఖాతా నుంచి రూ. రెండు లక్షల 19 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మొక్క పెంచిన వ్యక్తిపై కేసు



గంజాయి మొక్క తొలగించిన సీఐ

కల్హేర్(నారాయణఖేడ్): ఇంటి ఆవరణలో గంజాయి మొక్క పెంచిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి బుధవారం తెలిపారు. దేవునిపల్లికి చెందిన నమిల్ల మల్లేశం ఇంటి ముందు గంజాయి మొక్క పెంచుతున్నాడని అందిన సమాచారం మేరకు సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడిచేసి గంజాయి మొక్క తొలగించామని తెలిపారు. మల్లేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అడ్డదారుల్లో గోవా మద్యం

ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాల్లో తరలిస్తున్న మాఫియా

● అక్కడ తక్కువ ధరకు కొనుగోలు.. ఇక్కడ అధిక రేటుకు విక్రయం
● తరచూ పట్టుబడినా ఆగని మద్యం రవాణా

జహీరాబాద్ టౌన్: గోవా మద్యం అడ్డదారుల్లో జిల్లాకు చేరుతోంది. గోవాలో మద్యం ధరలు తక్కువగాను, తెలంగాణలో మద్యం ధరలు ఎక్కువగా ఉండటం, కావాల్సిన బ్రాండ్లు లభించకపోవడం వంటి వాటిని మద్యం మాఫియా చక్కగా 'క్యాష్'చేసుకుంటోంది. మద్యం రవాణ చేస్తూ ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో తరచూ పట్టుబడినా లిక్కర్ రవాణ దందా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు ప్రయాణికుల ముసుగులో మద్యంతో పాటు బంగారం, డ్రగ్స్ వంటి వాటిని గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు తీసుకొస్తున్నారు.

కిక్కు ఎక్కువ..ధర తక్కువ

తెలంగాణలో మద్యం ధర ఎక్కువగా ఉండటంతోపాటు కావాల్సిన బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో మద్యం ప్రియులు గోవా లిక్కర్‌ను ఇష్టపడి మరీ కొనుగోలు చేస్తున్నారు. గోవా పర్యటనకు వెళ్లిన వారిలో చాలామంది మద్యం తీసుకొస్తుంటారు. సరిహద్దులో తనిఖీలు మొక్కుబడిగా చేస్తుండటం, గోవా నుంచి పలు అడ్డదారులు ఉండటంతో గోవా మద్యాన్ని యథేచ్ఛగా ఇక్కడకు తీసుకొచ్చేస్తున్నారు.

చెక్‌పోస్టు ఉన్నా..

గోవా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మద్యాన్ని రాష్ట్రంలోకి రాకుండా నివారించేందుకు జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి, మాడ్గి వద్ద సరిహద్దులో ఎక్సైజ్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టులో సీఐ,ఎస్సై,కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తుంటారు. గోవా, మహారాష్ట్రల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో మద్యం బాటిళ్లు పట్టుబడుతుండగా వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. కానీ నిందితులు మాత్రం పట్టుబడకపోవడం గమనార్హం.



సరిహద్దులోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ట్రావెల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వాణిజ్య చెక్‌పోస్టుల ఎత్తివేత

జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత వాణిజ్య పన్నుల చెక్‌పోస్టులను ఎత్తివేశారు. జహీరాబాద్ పట్టణ సమీపంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో చిరాగ్‌పల్లి చెక్‌పోస్టును తొలగించడంతో అక్రమార్కులు యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. నిత్యం హైదరాబాద్- ముంబై నగరాలకు జహీరాబాద్ మీదుగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. ప్రయాణికుల ముసుగులో బస్సుల్లో మద్యం, బంగారం,డగ్స్‌ను తరలిస్తున్నారు. గతేడాది రూ.కోటికిపైగా విలువైన కేజీన్నర బంగారాన్ని కారులో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. అక్రమ రవాణకు అడ్డుకట్ట వేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కొన్ని సంఘటనలు..

- ఆగస్టు 18వ తేదిన జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు చెక్‌పోస్టు వద్ద 74 గోవా మద్యం బాటిళ్లను పట్టుకున్నారు.
- ఆగస్టు 20 సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఆగస్టు 21న చెక్‌పోస్టు ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీ చేస్తూ 37 గోవా బాటిళ్ల పట్టుకున్నారు.
- ఈ నెల 20 గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న 36 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.

క్లుప్తంగా

సాంకేతికతతో కేసులు పరిష్కరించాలి: సీపీ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కేసుల ఛేదనలో సాధ్యమైనంత ఎక్కువగా సాంకేతికతను ఉపయోగించుకోవాలని సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సిద్దిపేట డివిజన్ పోలీసు అధికారులతో సీపీ పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా కేసుల పరిశోధన ఉండాలన్నారు. బతుకమ్మ, దసర పండుగల సందర్భంగా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఎస్‌ఐ సుభాష్ పాల్గొన్నారు.

ఏవీఆర్ పరిశ్రమలో ప్రమాదం

- నలుగురి కార్మికులకు గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని యావాపూర్ శివారులో ఉన్న ఏవీఆర్ రసాయనిక పరిశ్రమలో బుధవారం ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏవీఆర్ పరిశ్రమలో ప్రమాదవశాత్తు రియాక్టర్ పైపు పగలడంతో సమీపంలో పని చేస్తున్న కార్మికులపై రసాయనిక మెటీరియల్ పడింది. ఈ ఘటనలో కార్మికులు శివారెడ్డి, సింహాచలం, దివాకర్, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయి. వెంటనే పరిశ్రమ యాజమాన్యం క్షతగాత్రులను సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ (ఫైల్)

సంగారెడ్డి క్రైమ్ : ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని బైక్ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గీతానగర్‌కు చెందిన జాదవ్ ప్రవీణ్ (25) తన కూతురును బైక్‌పై మంగళవారం అర్ధరాత్రి ఆస్పత్రికి తీసుకెళ్లి అడ్మిట్ చేశాడు. తిరిగి వచ్చే క్రమంలో స్థానిక ప్రభుత్వ తారా డిగ్రి కాలేజ్ వద్ద అగి ఉన్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఐక్యత’తో ఉచిత ఆరోగ్య సేవలు

టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



ఆర్గానిక్ హెల్త్‌కిట్స్ పంపిణీ చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో ప్రతీ కుటుంబానికి ఉచిత ఆరోగ్య సేవలు అందజేస్తామని టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పల్లుతండాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్‌క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ శిబిరంలో 260 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రజలకు ఆర్గానిక్ హెల్త్‌కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకిరెడ్డి మాట్లాడుతూ.. ఐక్యత ఫౌండేషన్ విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఐక్యత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరకొండ తండా మాజీ సర్పంచ్ నారాయణ, మాజీ ఉప సర్పంచ్ రవీందర్, నాయకులు రమేశ్‌నాయక్, గేమ్యా, బిచ్యా పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోండి

జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం

కొడంగల్ రూరల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం సూచించారు. బుధవారం మండలంలోని రుద్రారం గ్రామంలో పంట వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంట వివరాలను అక్టోబర్ 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి జి.తులసి, ఏఈఓ శ్రీపతిరెడ్డి, రైతులు వెంకటయ్య, మొయినొద్దీన్ పాల్గొన్నారు.

తాండూరుకు చేరిన బతుకమ్మ చీరలు

తాండూరు రూరల్: పట్టణంలోని ఐకేపీ కార్యాలయానికి బుధవారం బతుకమ్మ చీరలు వచ్చాయి. నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలకు కలిపి 45,600 చీరలు రావాల్సి ఉండగా 25,231 వచ్చినట్లు తాండూరు ఏపీఎం బాలయ్య తెలిపారు. మరో 20,369 చీరలు రావాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేస్తామన్నారు.

ఆరోగ్య కేంద్రం తరలింపులో జాప్యం

ఒకే గ్రామంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీలు

- మిర్జాపూర్ పీహెచ్‌సీని మెటల్‌కుంటలో ఏర్పాటుకు యోచన
- చిరాగ్‌పల్లిలో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రతిపాదన



మిర్జాపూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం

జహీరాబాద్: సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకే గ్రామంలో కొనసాగుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మారుమూల గ్రామానికి తరలించడం ద్వారా పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. నాలుగేళ్ల క్రితం మిర్జాపూర్ కేంద్రంగా సామాజిక ఆరోగ్య కేంద్రం (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) ఏర్పాటు చేశారు. కొత్త భవనం నిర్మించి 30 పడకల సదుపాయం కల్పించారు. మిర్జాపూర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసినందున అక్కడ కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదే కేంద్రం పరిధిలో ఉన్న ఇతర గ్రామంలోకి మార్చడం ద్వారా పరిసర గ్రామాలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పలు గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు కాగానే పీహెచ్‌సీని మరో గ్రామానికి మార్చాల్సి ఉన్నా ఈ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మెటల్‌కుంటలో పీహెచ్‌సీ!

మెటల్‌కుంట కేంద్రంగా పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలనే విషయమై వైద్యశాఖ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మెటల్‌కుంట కేంద్రంగా పీహెచ్‌సీని నడపాలన్నా పక్కా భవనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కొత్త భవనం నిర్మించే వరకు అద్దె భవనంలోనైనా ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే మిర్జాపూర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసినా ఎనిమిది మంది వైద్యులకు గాను ముగ్గురు మాత్రమే విధులకు హాజరవుతున్నట్లు రోగులు పేర్కొంటున్నారు. పిల్లల వైద్యులు, గైనకాలజీ వైద్యుల అవసరం ఉంటుందంటున్నారు. అయినా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిరాగ్‌పల్లి కేంద్రంగా..

జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామం కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది. ప్రస్తుతం మొగుడంపల్లి కేంద్రంగా వైద్య సేవలందిస్తున్నారు. మొగుడంపల్లి పీహెచ్‌సీ పరిధిలో 80వేల జనాభా ఉండటంతో తగిన మేరకు వైద్య సేవలందడం లేదనే ఉద్దేశంతో చిరాగ్‌పల్లిలో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటుకు నిర్ణయించారు. దీంతో మొగుడంపల్లి మండలంలోని మాడ్గి, ధనాసిరి, గోపన్‌పల్లి, అసద్‌గంజ్ గ్రామాలతోపాటు జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి, కొత్తూర్(బి), కాశీంపూర్, సత్వార్ గ్రామాలను చిరాగ్‌పల్లి పీహెచ్‌సీ కిందకు చేర్చనున్నారు. సత్వార్ గ్రామంలో ఉపకేంద్రం ఏర్పాటుకు సైతం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాకు ఉప కేంద్రాన్ని మంజూరు చేశారు. దీంతో పరిసర తండాలకు వైద్య సేవలు అందుబాటులో వస్తాయి.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది..

మిర్జాపూర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కొనసాగుతున్నందున, అక్కడ గతం నుంచి కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెటల్‌కుంటకు మార్పు చేయాలనే విషయం ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అక్కడ పక్కా భవనం లేనందున విధిలేని పరిస్థితుల్లో మిర్జాపూర్‌లోనే కొనసాగించాల్సి వస్తోంది. అద్దె భవనం కూడా అందుబాటులో లేదు. కొత్త భవనం నిర్మించాక మారుస్తాం. చిరాగ్‌పల్లిలో కొత్తగా పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపించాం.

– గాయత్రిదేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జహీరాబాద్



ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న నందకుమార్‌రెడ్డి

క్రమశిక్షణ అలవరిచే సమైక్యతా శిబిరాలు

కాళోజీ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్.నందకుమార్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సమైఖ్యత శిబిరాల్లో పాల్గొనడం ద్వారా చక్కటి నడవడిక, క్రమశిక్షణ అలవడుతుందని కాళోజీ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్.నందకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగు మండలం క్షీరసాగర్ హంస వైద్య కళాశాలలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్.ఉమేశ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజ శ్రేయస్సు పట్ల బాధ్యత, సంబంధాలను మెరుగుపరుచుకోవడం, విద్యార్థులను దేశ సేవలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ స్వచ్ఛభారత్, సర్వేజనా సుఖినోభవంతు వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువతను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను పాఠ్యాంశాలతోపాటు సామాజిక సేవలో ప్రోత్సహించడమే జాతీయ సేవా పథకం లక్ష్యమన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, సామాజిక సేవకు అంకితం కావాలని సూచించారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు త్వరలో జరుగనున్న అంతర్-వైద్య కళాశాల క్రీడా పోటీల నిర్వహణ కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం నందకుమార్‌రెడ్డిని ఉమేశ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూరుస్ షెహర్ ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌బాబు, వివిధ యూనివర్సిటీల అధికారులు మల్లేశ్వర్, రాంకుమార్ పాల్గొన్నారు.

సిద్దిపేట బల్దియాలో ఏసీబీ ఆరా

- వజ్రోత్సవ ఖర్చుల వివరాల సేకరణ
- రికార్డులు పరిశీలించిన బృందం

సిద్దిపేటజోన్: సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆరా తీశారు. 2022లో జరిగిన సమైక్యతా వజ్రోత్సవ వేడుకల లెక్కల్లో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు వివరాలు సేకరించారు. గత నెలలో బల్దియాలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందిని ఆరా తీసిన ఏసీబీ మళ్లీ రెండవ సారి సమగ్ర వివరాలు సేకరించినట్టు సమాచారం. అందులో భాగంగానే మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ ఉన్నతస్థాయి అధికారి ఆధ్వర్యంలో బృందం వివిధ స్థాయిలో ఉన్న మున్సిపల్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. రికార్డులు పరిశీలించి అధికారుల ద్వారా స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్టు సమాచారం. 2022లో వజ్రోత్సవ వేడుకల ఖర్చు అంశంలో లక్షల్లో అవినీతి జరిగిందని పలువురు ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కూడా తనిఖీలు చేసినట్లు తెలిసింది.

యంత్రం జాడేదీ !

రాయితీ వ్యవసాయ పరికరాల కోసం రైతుల ఎదురుచూపులు

- ఆరు నెలల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- 454 యూనిట్లు మంజూరు
- మహిళా రైతులకు మాత్రమే..
- రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.5 లక్షల వరకు ఉపయోగం



వికారాబాద్: రాయితీ యంత్ర పరికరాల కోసం రైతులు ఎదురుచూడక తప్పడం లేదు. దరఖాస్తులు స్వీకరించి ఆరు నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం వాటి ఊసెత్తడంలేదు. మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై పథకం అమలు చేయాలని నిర్ణయించింది. కిసాన్, స్వయం సహాయక సంఘాల ద్వారా పరికరాల కొనుగోలుకు అవకాశం కల్పించింది. అయితే ప్రక్రియ దరఖాస్తుల దశ దాటడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకం పేరిట వ్యవసాయ పనిముట్లు అందిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు, రైతు బీమా పథకాల కారణంగా రాయితీ యంత్రాలకు స్వస్తి పలికారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పథకం అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ఇంకా ప్రారంభం కాలేదు. ఈలోగా కేంద్ర ప్రభుత్వం మహిళా రైతులకు సబ్సిడీపై పనిముట్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా దరఖాస్తులు కూడా స్వీకరించింది.

జిల్లాకు 454 యూనిట్లు

జిల్లాకు 454 యూనిట్లు మంజూరు చేశారు. జనరల్ కేటగిరి కింద చిన్న, సన్నకారు రైతులతోపాటు పెద్ద రైతులు వస్తారు. వీరికి 338 యూనిట్లు కేటాయించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళా రైతుల కోసం 77 యూనిట్లు, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన చిన్న, సన్నకారు, పెద్ద రైతులకు 39 యూనిట్లు కేటాయించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ఎస్సీలకు 25, ఎస్టీలకు 11, జనరల్‌కు 116 యూనిట్లు కేటాయించారు. పరిగి నియోజకవర్గంలోని ఎస్సీలకు 17, ఎస్టీలకు 09, జనరల్‌కు 77 యూనిట్లు కేటాయించారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఎస్సీలకు 20, ఎస్టీలకు 11, జనరల్‌కు 79 యూనిట్లు మంజూరు చేశారు. తాండూరు నియోజకవర్గంలోని ఎస్సీలకు 15 యూనిట్లు, ఎస్టీలకు 8, జనరల్ మహిళలకు 64 యూనిట్లు కేటాయించారు. ఇందులో కాళ్లు, చేతుల సాయంతో పని చేసే స్ప్రేయర్లు, బ్యాటరీతో పని చేసే స్ప్రేయర్లు ఉన్నాయి. నాగలి, గొర్రు, ఎరువులు, విత్తనాలు వేసే ట్రాక్టర్‌కు వినియోగించే పరికరాలు, పురుగుల మందు స్ప్రే చేసేం డ్రోన్లు కూడా ఉన్నాయి. పవర్ వీడర్లు, బ్రష్ కటర్లు తదితర యంత్ర పరికరాలను రాయితీపై అందజేయనున్నారు. ఈ విషయమై డీఏఓ రాజరత్నంను వివరణ కోరగా యంత్ర పరికరాల కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్న విషయం నిజమే కానీ, అర్హుల ఎంపికపై తమకెలాంటి ఆదేశాలు అందలేదని తెలిపారు.

అర్హులు ఎవరంటే..

2024 – 25 వ్యవసాయ సంవత్సరానికి గాను ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.3 వేల నుంచి గరిష్టంగా రూ.5 లక్షల వరకు రాయితీ వర్తించనుంది. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రిజర్వేషన్ ప్రాతిపదికన వాటా కేటాయించగా మిగతా సామాజిక వర్గాలకు జనరల్ కేటగిరి కింద కేటాయించారు. మహిళా రైతులందరూ ఈ పథకానికి అర్హులు. ఎకరంలోపు వ్యవసాయ భూమి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.లక్షకు పైగా విలువ చేసే యంత్రాలు కావాల్సి వస్తే ఒక ఎకరం కంటే ఎక్కువ భూమి ఉండాలి. ఎకరం లోపు ఉంటే రూ.లక్షలోపు యంత్రాల కోసం అర్జీ పెట్టుకోవచ్చు. వ్యవసాయ డ్రోన్లు, మినీ ట్రాక్టర్లు కావాలంటే కనీసం రెండున్నర ఎకరాల పొలం ఉండాలి. జిల్లాస్థాయి కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది.

అభివృద్ధి పనులు వేగిరం చేయండి

రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి



మంచాల పాఠశాల అభివృద్ధి ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

మంచాల: తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్) అభివృద్ధి పనులను వేగిరం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, డైరెక్టర్ నవీన్ నికోలస్ అన్నారు. బుధవారం వారు మంచాల మండల పరిధిలోని ఆరుట్ల, మంచాల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక, జరుగుతున్న పనులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుట్లలో ప్రీ ప్రైమరీ పాఠశాల నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు సులువుగా ఉంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని.. విద్యార్థుల సంఖ్య సైతం అదే విధంగా పెరిగిందన్నారు. డిజిటల్ తరగతులు, క్రీడా ప్రాంగణం, పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పనులు మరింత వేగిరం చేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధితోనే పిల్లల భవిష్యత్ మారుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అదనపు తరగతి గదులు, లైబ్రరీ, సరిపడా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని పేరెంట్స్ కమిటీ కోరింది. అనంతరం మంచాల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ చెప్పట్టే అభివృద్ధి కార్యక్రమాలను మ్యాప్ ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుశీందర్‌రావు, విద్యా కమిషన్ సభ్యులు పద్మజాషా, జ్యోత్స్న, ఎంఈఓ రాందాస్, మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌గౌడ్, నారాయణరెడ్డి, ఝాన్సీ, రుబియానా బేగం, మోహన్‌రెడ్డి, ఆయా పాఠశాలలకు చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

14న సీఎం రాక?

ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వసతులు, విద్యాశాఖ అధికారులతో సమావేశమై విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భాగంగానే పనులు వేగవంతగా చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సందర్శనార్థం వచ్చినట్లు సమాచారం. నవంబర్ 14న సీఎం వచ్చే అవకాశం ఉందని వినికిడి.

పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- వచ్చేనెల 16,17,18 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ పోటీలు

పటాన్‌చెరు: మరోమారు రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్‌చెరు కేంద్రంగా నిలవబోతోంది. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడలను పటాన్ చెరు కేంద్రంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను నిర్వహించేందుకు పటాన్‌చెరుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా ఇందుకు సమ్మతించిందన్నారు. అండర్ –17 బాలుర వాలీబాల్, అండర్–14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను అక్టోబర్ 16, 17,18 తేదీలలో పటాన్‌చెరు పట్టణంలోని మైత్రీ మైదానంలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 420 మంది క్రీడాకారులతోపాటు వందమంది వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. వీరందరికీ మూడు రోజులపాటు భోజనం, వసతి, బహుమతులు సొంత నిధులతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లను సైతం సొంత నిధులతో జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని రాష్ట్ర, జాతీయ క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సమీక్షలో సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు..

- రెండుసార్లు తప్పించుకుని.. మూడోసారి మృతి
- వర్గల్ మండలం జబ్బాపూర్‌లో విషాదం



మహిపాల్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): రెండుసార్లు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న యువకుడ్ని మృత్యువు మూడోసారి రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈ ఘటన వర్గల్ మండలంలోని జబ్బాపూర్‌లో జరిగింది. ములుగు ఎస్ఐ విజయకుమార్, కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మహిపాల్ డోజర్ ట్రాక్టర్ డ్రైవర్. అతనికి భార్య అర్చన, నాలుగేళ్లలోపు రియాన్ష్, చైత్రిక అనే ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలం నుంచి ములుగు మండలంలోని అచ్చాయిపల్లిలో నక్కిర్తి దేవేందర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనికోసం రోజు మాదిరిగా జబ్బాపూర్ నుంచి ఈ నెల 21న ఉదయం అచ్చాయిపల్లికి వెళ్లాడు. విధులు ముగిసిన తరువాత బైకుపై అచ్చాయిపల్లి నుంచి తున్కిబొల్లారం వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న నక్కిర్తి శివులు బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన మహిపాల్‌ను లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆస్పత్రికి, ఆ తరువాత గాంధీకి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా గతంలో ఆత్మహత్యాయత్నం చేసిన మహిపాల్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఆ తరువాత 2025 ఫిబ్రవరి 19న శివాజీ జయంతి సందర్భంగా గ్రామంలో ఇనుప స్తంభం వద్ద జెండా ఎగురవేసే ప్రయత్నంలో విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతిచెందగా, మహిపాల్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మూడోసారి అచ్చాయిపల్లిలో రోడ్డు ప్రమాద ఘటనలో చివరకు మృత్యువు పాలయ్యాడని కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పాడి పరిశ్రమ స్థాపనతో లాభాలు

పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి

షాబాద్: మహిళలు, యువత పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుని లాభాలు ఆర్జించవచ్చునని పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో ×జిల్లా శాస్త్రీయ పద్ధతుల డెయిరీసాగు, పాల ఉత్పత్తుల విలువల జోడింపు౯పై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ (పీవీఎన్‌టీవీయూ) డాక్టర్ కిషన్‌కుమార్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా ఆధునిక డెయిరీ ఫారాల స్థాపనపై సూచనలు ఇచ్చారు. పశుపోషణ, షెడ్ నిర్మాణం, తక్కువ లాభాలు వంటి అంశాలపై వివరించారు. సేవాస్ఫూర్తి ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత అంశంపై పాడి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పథకాల వినియోగం, వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ప్రోత్సహించారు. మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై డెమో ఇచ్చారు. ప్రొఫెసర్ శశికుమార్, సాహిత్య రాణి, అసోసియేషన్ ప్రొఫెసర్ లైవ్‌స్టాక్, ప్రొడక్ట్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో కోవా, కలాకండ్, పనీర్ చన్నా, రసగుల్లా, రసమలై, బాసుంది, మజ్జి గ, లస్సీ, ఫ్లేవర్ మిల్క్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. పశువైద్యాధికారి స్రవంతి, పాడి రైతులు యాదయ్య, మాణిక్యం, రాములు, శ్రీని వాస్, రాజు, గౌరీశ్వర్, మహేశ్, పూర్ణచందర్, రమ్య, స్వరూప, యజ్ఞశ్రీ, పద్మ తదితరులున్నారు.



మహిళా రైతులతో కొండల్‌రెడ్డి, రత్నాకర్ తదితరులు